

హైదరాబాద్‌లో ఎడ్‌సెట్ ఫలితాలను విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ నవీన్‌మిట్టల్

# ఎడ్‌సెట్ ఫలితాల్లో అమ్మాయిల హవా

| ఫలితాల వివరాలు | అబ్బాయిలు | అమ్మాయిలు | మొత్తం |
|---|---|---|---|
| దరఖాస్తుదారులు | 5,732 | 28,147 | 33,879 |
| హాజరైనవారు | 4,830 | 24,633 | 29,463 |
| అర్హులైనవారు | 4,769 | 23,780 | 28,549 |
| అర్హుల శాతం | 98.74 | 96.54 | 96.90 |

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : టీచర్ ఉద్యోగాలు మహిళలవే అన్న భావన ఇప్పటికే స్థిరపడింది. దీనినే కొనసాగిస్తూ బీఈడీ కోర్సుల్లో ఏటా అమ్మాయిలే అత్యధికంగా చేరుతున్నారు. ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షకు అత్యధికంగా వారే హాజరవుతున్నారు. ఈ ఏడాది రెండేండ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించిన టీజీ ఎడ్‌సెట్ -24 ఫలితాల్లో అమ్మాయిలు సత్తాచాటారు. ఈ ఏడాది మొత్తం 28,549 మంది అర్హత పొందగా, వీరిలో అత్యధికంగా 23,780 మంది అమ్మాయిలే ఉన్నారు. అబ్బాయిలు 4,769 మంది క్వాలిఫై అయ్యారు. ఎడ్‌సెట్ -24 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ నవీన్‌మిట్టల్ ఈ ఫలితాలను విడుదల చేశారు. మే 23న ఎడ్‌సెట్ పరీక్షను నిర్వహించారు. సంఖ్యాపరంగా తీసుకొంటే ఎడ్‌సెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో 83శాతం అమ్మాయిలే ఉండగా, క్వాలిఫై అయిన వారిలోను 83శాతం అమ్మాయిలే ఉండటం విశేషం. రాష్ట్రంలో 208 బీఈడీ కాలేజీలుండగా, వీటిలో 20వేలకు పైగా సీట్లున్నాయి.

## ● నేడే టెట్ ఫలితాలు

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫలితాలు బుధవారం విడుదల చేయనున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటించారు. పరీక్షలను మే 20 నుంచి జూన్ 2 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించగా, 2,36,487 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

# ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో తెలంగాణ విద్యార్థి సత్తా

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో తెలంగాణకు చెందిన విద్యార్థి యెల్లు శ్రీశాంత్‌రెడ్డి సత్తా చాటాడు. అగ్రికల్చర్ ఇంజినీరింగ్ విభాగంలో శ్రీశాంత్‌రెడ్డి ప్రథమ ర్యాంకు సాధించాడు. మంగళవారం అమరావతిలో ఈఏపీసెట్ ఫలితాలను ఆ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జే శ్యామలరావు విడుదల చేశారు. ఇంజినీరింగ్‌లో 75.51 శాతం ఉత్తీర్ణత, అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌లో 87.11 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత మే 16 నుంచి 23 వరకు ఈఏపీసెట్ నిర్వహించారు. ఇటీవల ప్రాథమిక కీని వెల్లడించిన అధికారులు తాజాగా ఫలితాలను విడుదల చేశారు.




















